క్లుప్తంగా

నట్టల నివారణ మందులు పంపిణీ



మందులు అందిస్తున్న పశువైద్యాధికారి

శంకరపట్నం: మండలంలోని గుడాటిపల్లి గ్రామంలో శుక్రవారం ఆవులు, గేదెలకు పశువైద్యాధికారి మాదవరావు గర్భకోశవ్యాధి చికిత్సలు చేశారు. అనంతరం మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందులు, ఇతర టీకాలు వేశారు. రైతులు పశుసంపదను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష, రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ప్రారంభించిన కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగును నిర్వహిస్తోందని, అంధత్వ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరిసింగ్, తహసీల్దార్ రాజేశ్వరి, కమిషనర్ సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు రాము, శ్రీలత, విజయమల్లయ్య, డాక్టర్ రవీందర్, సూపర్‌వైజర్ అరుణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంటలో ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

జమ్మికుంట: ప్రైవేట్ ఆసుపత్రులు లింగ నిర్ధారణ, గర్భవిచ్ఛిత్తికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ వైద్యాధికారి సుజాత అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రిలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. బర్త్ పోర్టల్‌లో ప్రతి పుట్టుకను ఆన్‌లైన్ చేయాలని, ఆసుపత్రిలోని బయో మెడికల్ వేస్టేజీని సురక్షిత పద్ధతిలో నిర్మూలించాలని ఆదేశించారు. అక్రమాలు, లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని తెలిస్తే ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, హెచ్‌ఈవోవో రాజగోపాల్, డీపీఎంవో దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి ర్యాంకులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి ర్యాంకులు సాధించవచ్చని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని, కాలేజీ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, కళాశాల అధ్యాపకులు సంపత్‌కుమార్, మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లింగం, లైబ్రేరియన్ శ్రీనివాస్, రవిచంద్రన్, అనిత, మమత, స్వరూప, రాణి, కవిత, కృష్ణమోహన్, అమరజ్యోతి, పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన మారాజు మల్లయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మల్లయ కుటుంబానికి జయపాల్‌రెడ్డి మిత్ర మండలి తరుపున సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి ఐదువేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రయాస

- గుంతల రోడ్లపై ప్రయాణానికి జంకుతున్న ప్రజలు
- పదిహేనేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
- ఇసుక రవాణా, కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్నా పట్టింపు కరువు



పూర్తిగా ధ్వంసమైన ఇందుర్తి గ్రామ పరిధిలోని అర్కాలపల్లె-ముదిమాణిక్యం బీటీరోడ్డు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు పదిహేనేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఫలితంగా గతుకులు, గుంతల రోడ్లపై ప్రయాణానికి ప్రజలు జంకుతున్నారు. బీటీ రోడ్లు రీబీటీకి, మెటల్ రోడ్లు బీటీ రోడ్లకు నోచుకోవడం లేదు. మట్టిరోడ్లకు మోక్షమే లేకుండాపోయింది. పలుమార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో రోడ్లు మరమ్మతు చేయాలని తీర్మానాలు ప్రవేశపెట్టినా స్పందన కరువైంది. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్‌కు సైతం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. కానీ బడ్జెట్ కొరత వల్ల నిధులు మంజూరు కావడంలేదనే వాదన వినిపిస్తోంది.

బీటీ రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికుల అవస్థలు

ఇందుర్తి క్రాస్ రోడ్డు నుంచి అరకాలపల్లె – ముదిమాణిక్యం, చిగురుమామిడి నుంచి రేకొండ, బొమ్మనపల్లి, లంబాడిపల్లి నుంచి చిగురుమామిడి, కొండాపూర్ క్రాస్‌రోడ్డు నుంచి గ్రామం చివర వరకు, రామంచ నుంచి చిన్నముల్కనూర్ క్రాసింగ్, సుందరగిరి నుంచి గాగిరెడ్డిపల్లి, పీచుపల్లి నుంచి చిన్నముల్కనూర్ వరకు బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రీ బీటీవేయకపోడంతో వేసిన బీటీ కొట్టుకపోయి కంకర తేలి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి.

కనీస మరమ్మతులకు నోచుకోని కంకరరోడ్లు

నవాబుపేట్ నుంచి ఇందుర్తి, కొండపూర్ నుంచి నవాబుపేట్,ఇందుర్తి నుంచి గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి నుంచి బొమ్మనపల్లి, ముదిమాన్యం నుంచి క్రాస్‌రోడ్ వరకు,లంబాడిపల్లి నుంచి రామంచ నుంచి కొత్తపల్లి క్రాస్‌రోడ్ వరకు మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే కంకర రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈరోడ్లపై నడవలేని పరిస్థితిని నెలకొంది. ఏళ్ల క్రితం వేసిన మట్టిరోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చలేని దుస్థితిలో పాలకులున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పెద్దపెద్ద గొయ్యిలు వర్షాకాలంలో నీటితో నిండి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రవహించే మోయతుమ్మెద వాగు నుంచి నిత్యం ఇసుక రవాణా అవుతుంది. ఇసుక ట్రాక్టర్లతో రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్లకు మరమ్మతులు చేసే అధికారం మండల, జిల్లా పరిషత్‌కు మాత్రమే ఉంది. కానీ నిధులు లేక రోడ్లు బాగు చేస్తలేరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

విన్నవించినా ఫలితం లేదు



మా గ్రామం నుంచి ఇటు కొండాపూర్, అటు ఇందుర్తి గ్రామాలకు వెళ్లే మెటల్ రోడ్లను బీటీ రోడ్లు మార్చాలని అధికారులు, ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు వినితిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండాపోయింది. నిధులు రావు, మరమ్మతుకు నోచుకోవు, ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నాం.

– సుద్దాల ప్రవీణ్‌కుమార్, సర్పంచ్, నవాబుపేట్

10 కి.మీ తిరిగి వెళ్లాలి



బొమ్మనపల్లి నుంచి చిగురుమామిడి వెళ్లే రోడ్డు పదిహేనేళ్లుగా మరమ్మతుకు నోచుకోవడంలేదు. ఇసుక దిబ్బలు, కోతకు గురైన రోడ్డుపై చిగురుమామిడికి వెళ్లలేక పది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయంపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించాను.

– కానుగంటి భూంరెడ్డి, సర్పంచ్, బొమ్మనపల్లి

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



మండలంలోని రోడ్ల మరమ్మతులకు తగిన నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయి. వీటన్నింటికి తగిన ప్రతిపాదనలు తయారు చేసి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, జెడ్పీకి సమర్పించాం.

– రవిప్రసాద్ ఇన్‌చార్జి ఏఈ, డీఈఈ పంచాయతీ రాజ్‌శాఖ, చిగురుమామిడి

వంటగ్యాస్ ధరల పెరుగుదలపై ఆందోళన

చిగురుమామిడి: వంటగ్యాస్ ధరల పెరుగుదలపై మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. బస్టాండ్ ఎదుట హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, రైతు సమన్వయసమితి మండల కోఆర్డినేటర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, సర్పంచులు, పార్టీ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శులు, మండల ప్రచార కార్యదర్శి, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం దారుణమని పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



సైదాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా


నియామకం

వైఎస్సార్‌టీపీ మానకొండూర్ నియోజకవర్గ సింగిల్ కో ఆర్డినేటర్‌గా దుబ్బ నీరజ



మానకొండూర్: వైఎస్సార్ టీపీ మానకొండూర్ నియోజకవర్గ సింగిల్ కోఆర్డినేటర్‌గా దుబ్బ నీరజను పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి నియమించారు. పార్టీ ఏర్పాటు నుంచి క్రియాశీలకంగా వ్యవహరించిన నీరజ సేవలను గుర్తించి కోఆర్డినేటర్‌గా అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ.. నమ్మకంతో ఇచ్చిన పదవికి తగిన న్యాయం చేస్తానన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మానకొండూర్ నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని ఆయన మరణానంతరం అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్ నుంచి పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియమకానికి సహకరించిన పార్టీ అధ్యక్షురాలు, రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న అక్కెనపల్లి కుమార్

చొప్పదండి: నియోజకవర్గంలో పూర్తి స్థాయి కమిటీలను వేసి వైఎస్సార్‌టీపీని బలోపేతం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి నియోజకవర్గ కోఆర్డినేటర్ అక్కెనపల్లి కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం, దళితులకు మూడెకరాల భూమి అమల్లో విఫలమయ్యారని విమర్శించారు. పట్టణంలో పద్నాలుగు వార్డులకు కమిటీలు వేస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు వరాల శ్రీనివాస్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు పోలు శ్రీనివాస్, చొప్పదండి పట్టణ నాయకులు రొడ్డవేని తిరుపతి, బట్టు రాజు, జిల్లా నాయకులు పూకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ చీడపీడల నివారణపై అవగాహన

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు క్లస్టర్ రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం యాసంగిలో పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటల్లో చీడపీడలు, తెగుళ్ల నివారణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, పీఎస్‌బీ వాడకం, పచ్చిరొట్టే ఉపయోగాలు, చౌడు భూముల్లో వచ్చే సమస్యలకు నివారణ చర్యలు వివరించారు. అనంతరం మండలవ్యవసాయ విస్తరణ అధికారి రాకేశ్ పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి ఈ కేవైసీ, ఆయిల్‌పామ్ సాగు విధానం, సబ్సిడీ వివరాలను తెలియజేశారు. ఆత్మ బీటీఎంలు సునీల్‌బాబు, స్రవంతి, ఆర్ఎస్ఎస్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

✦ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేత

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలతోపాటు తాడికల్, కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు, కన్నాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లోని పదో విద్యార్థులకు శుక్రవారం గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజిరెడ్డి, రో జారమణి, రమణి, మమతాగౌతమి, ఆనందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ ట్రస్మా అధ్యక్షుడిగా ఆనందరెడ్డి

చొప్పదండి: ట్రస్మా మండల శాఖ అధ్యక్షుడిగా గీతా విద్యాలయం కరస్పాండెంట్ గుర్రం ఆనందరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యజమానులు పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సమావేశమై ఆనందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికున్నామని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా సింహాచల జగన్‌మోహన్‌స్వామి, ఉపాధ్యక్షుడిగా తమ్మడి కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా తిప్పర్తి శ్రీనివాస్, కోశాధికారిగా కునమల్ల దేవానంద్ నియామకమయ్యారు. కార్యక్రమంలో పుల్యాల లక్ష్మారెడ్డి, నాగోతు వినోద్‌కుమార్, కడారి రవికుమార్, కోడూరు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

✦ ఏసీడీ బిల్లులు రద్దు చేయాలి

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారుల నుంచి ఏసీడీ (అడ్వాన్స్ కన్జమ్షన్ డిపాజిట్)బిల్లులు బలవంతంగా వసూళ్లు చేస్తుందన్నారు. రిజిస్ట్రేషన్, బస్ చార్జీలను కేసీఆర్ సర్కార్ విపరీతంగా పెంచి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజానీకంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణంఏసీడీ బిల్లులు రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ఉపసంహరించుకొని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. నిరసనలో జిల్లా అధికార ప్రతినిధి ముత్యంరావు, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ ప్రవీణ్, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి గ్రామంలో శుక్రవారం రూ.1.40 కోట్లతో సీసీరోడ్డు, వివిధ రకాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్ ఆకుల పద్మ సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకష్ణారావు, సీనియర్ నాయకుడు నామాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: మండలంలోని ముత్తారంలో పెద్దమ్మతల్లి జాతరకు ఎమ్మెల్యే హాజరై మొక్కులు చెల్లించారు. అనంతరం ముదిరాజ్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. మండంలోని కన్నాపూర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు రేణుక, వెంకటరమణారెడ్డి, రంజిత్‌రావు, కోంద్ర రాజయ్య, భద్రయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ పాలకవర్గ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ శివారులో పదెకరాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఎంపీపీ చిలుక రవీందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, తదితరులు వినతిపత్రం అందించారు. యార్డుకు కేటాయించిన తొమ్మిది ఎకరాల్లో ఇటీవల రెండెకరాలు వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు కేటాయించారని, గతంలో గోదాంలు, కార్యాలయాలు నిర్మించడంతో ఇప్పుడు రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు రెండెకరాల స్థలం మాత్రమే మిగిలిందని తెలిపారు. పరిసర మండలాలకు చెందిన రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువస్తున్నారని, యార్డుకు దగ్గరలో పదెకరాల భూమిని ఏఎంసీకి కేటాయించాలని విన్నవించారు.

శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

మండలంలోని సాంబయ్యపల్లిలో రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ. 12 లక్షలతో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. క్యాంపు కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన రైతు అట్ల కనుకయ్య అప్పుల బాధతో మృతిచెందగా ఆయన పిల్లలకు ఎమ్మెల్యే పదివేల ఆర్థిక సాయం చేశారు. చిన్నారుల చదువుకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రామడుగు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, నాయకులు వంచ మహేందర్‌రెడ్డి, గునుకొండ అశోక్, కలిగేటి లక్ష్మణ్, కమలాకర్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలి



సింగాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

హుజూరాబాద్‌రూరల్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీడీవో వేముల విజయలక్ష్మి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్, ధర్మరాజుపల్లి, కందుగుల తదితర గ్రామాల్లో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, దళిత బంధు స్కీంలోని పౌల్ట్రీ పాం, నర్సరీలో మొక్కల పెంపకం పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో సమావేశ మందిరంలో సంబంధిత శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీలకు పనిచేసే ప్రదేశాలను గుర్తించి పనులు కల్పించాలని, వేసవిలో కూలీలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈజీఎస్‌లో భాగంగా రైతులు తమ పొలాల్లో కల్లాలను నిర్మించుకునే విధంగా చూడాలని, ఎండ తీవ్రతకు నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సురేందర్, ఈజీఎస్ ఏపీవో లలిత, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: కేంద్ర ప్రభుత్వం తక్షణం ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి నియోజక వర్గం నుంచి చేపట్టిన ఎమ్మార్పీఎస్ సంగ్రామ పాదయాత్ర శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, గుండి, గోపాల్‌రావుపేట గ్రామాల్లో కొనసాగింది. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, జిల్లా కో కన్వీనర్ చిలుముల రాజయ్య, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్, నాయకులు గజ్జెల స్వామి, లింగంపల్లి శ్రీనివాస్, కొత్తూరి రాజయ్య, శనిగరపు హన్మంత్, సురేశ్ పలువురు పాల్గొన్నారు.

బీజేపీ వైఖరిని ఎండగడుతాం

చొప్పదండి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా బీజేపీ మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. బీజేపీ వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన ర్యాలీ మంగళపల్లికి చేరింది. యాత్రలో ప్రశాంత్, రాజయ్య, రాజన్న, అంజయ్య, శ్రీనివాస్, సంపత్, రమేశ్, పోచయ్య, కమలాకర్, రాజమల్లయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పై విద్యార్థులు దృష్టి సారించాలని కిట్స్ వరంగల్ మెకానికల్ ఇంజినీరింగ్ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కె. రాజనరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదో ఇన్నోవేషన్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జాతీయ విద్యార్థి సమ్మేళనం శుక్రవారం హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ వి. రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీ సిలబస్ ప్రకారం మాత్రమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా అదనపు విద్యార్హతలు, ఎన్‌పీడీసీఎల్ ద్వారా సర్టిఫికేషన్ పొందే పరిజ్ఞానం పొందవచ్చన్నారు. విద్యార్థి కళాశాలలో ఉన్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని పరిపూర్ణ వ్యక్తిత్వం, కాలానుగుణంగా వైఖరి మార్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌లో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ పి.వెంకటయ్య, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వి.ఇంద్రనీల్, కార్యక్రమ సమన్వయకర్తలు యోగేశ్, ఆకుల కొమురయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తిమ్మాపూర్: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తమ్మిశెట్టి మల్లయ్య, దుర్గం తరుణ్ భక్తులకు అన్నదానం చేశారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌శ్రీనివాసరావు, ఈవో వెంకన్న, సర్పంచులు భాగ్యలక్ష్మి, శోభ, గణమ్మ, ఎంపీటీసీ పద్మ ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి రూ. 51 వేల విరాళం

చొప్పదండి: మండల కేంద్రంలో నిర్మి స్తున్న సాయిబాబా ఆలయానికి పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెళ్ళి చంద్రశేఖర్‌గౌడ్, శ్రీలక్ష్మి దంపతులు శుక్రవారం రూ. 51,116ల విరాళం ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి అందించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమిటిపల్లిలో శ్రీ స్వయంభు నల్లగొండ నరసింహస్వామివారి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సరోజననాగన్న, ఆలయ చైర్మన్ కుమారస్వామి, అర్చకులు వెంకటరామారావు శర్మ, దాతలు నరసింహస్వామివనజ, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వేదపండితుల ఆధర్యంలో వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాభివృద్ధికి రూ. ఐదు లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, దేవాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు ప్రభాకర్‌రావు, రాజేందర్‌రావు, సర్పంచ్ సరోజన, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు సంజీవరావు, పాల్గొన్నారు.



రామడుగు: శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం